www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 మే 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

## 22న గవర్నర్ రాక

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 22న జిల్లాకు రానున్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగే స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. జిల్లా అధికారులు అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 22న ఉదయం 9.45 నిమిషాలకు గన్నవరం విమానాశ్రయం నుంచి 10.45 నిమిషాలకు నగరంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి వెంకటాచలంలోని సింహపురి యూనివర్సిటీకి 11.30 గంటలకు చేరుకుంటారు. 12.55 వరకు జరిగే యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 5.35 నిమిషాలకు నెల్లూరు చేరుకొని హెలికాప్టర్‌లో విజయవాడ బయలుదేరి వెళ్తారు. అందుకు సంబంధించి కలెక్టర్ హరినా రాయణన్ అధికారులు ఏర్పాట్లకు సంబంధించి సూచనలు చేశారు.

అబ్దుల్ నజీర్, గవర్నర్

# ఆదర్శనీయులు సుందరయ్య..!

## ఉద్యమాలకు వేగుచుక్క - నేడు 39వ వర్థంతి

సుందరయ్య
నేటి తరానికి ఆదర్శనీయులు ...రాజకీయాల్లో ఇలాంటి నేతలు నేడు కనిపించం లేదు.నేటి రాజకీయాల్లో సుందరయ్య లాంటి నేతలు కనిపించడంలేదు.రాజకీయాలంటే ప్రజలకు సేవచేయడం, కష్టమొచ్చినప్పుడు వారి పక్షాన నిలబడడం, వారి కోసం పోరాటం చేయడం, ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు రాజకీయాలకు అర్థం మారిపోయింది. డబ్బు ఎంత ఎక్కువుంటే వారే ఓడా నేత, జనానికి తాయిలాలు ఎవరు ఎక్కువ ఇస్తారో వారే విజేత అన్నట్లు మారిపోయింది. రాజకీయాలంటే ప్రజలకు సేవచేయడం అని పుచ్చలపల్లి సుందరయ్య ఏ నాడో నిరూపించారు. 1913 మే1న విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఉదయించిన ఎర్రసూర్యుడు...1985 మే 19న అస్తమించారు. ఒక సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన జీవితం ప్రపంచానికి మార్గదర్శిగా మారింది. నేడు ఆయన 39వ వర్ధంతి, అలాంటి నేతను గుర్తుపెట్టుకున్నప్పుడే భావితరాలు ఐదుకుపోతాయి.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పుచ్చలపల్లి సుందరయ్య ఈ పేరు ఇంటే ఉద్యమాలకు చైతన్యం, సాధారణ ప్రజలకు స్ఫూర్తి.. రాజకీయ నేతలకు మార్గదర్శి. కొట్టాడిమంచికి విప్లవ జ్యోతి. చివరి రక్తపుబొట్టు వరకు ఎర్రజెండాను రెపరెపలాడించిన సింహపురి ముద్దుబిడ్డ. భరతమాత ప్రియ పుత్రులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరతకు ఆయన నిలువుటద్దం..నిత్య అధ్యయన శీలి. క్రమశిక్షణకు పెట్టింది పేరు.. అపార విజ్ఞానవంతుడు.. తెల్లటి పైజామాలో గొంగళి పైన కప్పుకొని నిరాడంబరంగా కనిపించే విప్లవమూర్తి. విడవలూరు మండలం అలగానిపాడు గ్రామంలో పుచ్చలపల్లి శేషమ్మ, వెంకటరామిరెడ్డి దంపతులకు 1913 మే 1న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. బాల్యం నుంచే అభ్యుదయ భావాలున్నాయి. అమీర్ హైదరఖాన్ ప్రోత్సాహం, స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమం వైపు అడుగులేశారు. తన తుది శ్వాసవరకు పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం పోరాడారు. విశాలాంధ్రలో ప్రజా రాజ్యం రావాలని సుందరయ్య ఆశించారు. విశాలాంధ్ర ఏర్పాటు జరిగింది. ప్రజారాజ్యం రాలేదు. సుందరయ్య కలలుకన్న విశాలాంధ్ర ఇప్పుడు రెండు ముక్కలైంది. ప్రజలు జీవన పరిస్థితులు మారిపోయాయి.

### పురిటిగడ్డ నుంచే ఉద్యమం..!

సుందరయ్య తన స్వగ్రామం నుంచే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 15 సంవత్సరాల వసిప్రాయంలో ప్రజల కోసం పెద్దలను ఎదిరించి నిలిచారు. వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారు.అక్కడ నుంచే ఉద్యమం ప్రారంభించారు. వ్యవసాయ కూలీలకు న్యాయమైన కూలీలు అందించేందుకు ఆయన పూనిది చేశారు. 1936లో గ్రామంలో కూలీ సంరక్షణ సంఘం ఏర్పాటు చేశారు. దానిని రాష్ట్ర వ్యాప్తింగా విస్తరించి వ్యవసాయ కార్మిక సంఘం నిర్మించారు. ఆ సంఘం ఇప్పుడు దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులకు అండగా అతి పెద్ద సంఘంగా ఏర్పడింది. సుందరయ్య స్ఫూర్తితో దేశంలో అనేక కూలీ పోరాటాలు సాగుతున్నాయి. స్వామి వివేకానంద ఉపన్యాసాలు సుందరయ్య ఆకర్షితులయ్యారు. ఆయన సోదరులు డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నబాటలోనే నడిచారు. పేద ప్రజల పట్ల ప్రేమానురాగాలు పెంపొందించుకొని ప్రజల మనుషులుగా మారిపోయారు. సుందరయ్య రష్యా సోషలిజం- విప్లవం గురించి అధ్యయనం చేశారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారత దేశానికివచ్చిన అమీర్ హైదర్‌ఖాన్ సుందరయ్యను ఎంతగానో ప్రోత్సహించి కమ్యూనిస్టుపార్టీ అభివృద్ధికి బాటలు వేసేలా చేశారు. దేశం గర్వించదగ్గ నేతగా ఆయన ఎదిగారు. ఇప్పటికీ సుందరయ్య చరిత్రను రాజకీయ నేతలు అధ్యయనం చేస్తారంటే ఆయన నిబద్ధత, నిజాయతీ అర్థమవుతుంది. చిన్నపాటి పదవివస్తేనే కోట్ల సంపాదించుకునే ఈ రోజుల్లో ఆయన తన ఆస్తిని సైతం పేదల కోసం ఖర్చుచేసిన త్యాగజీవి,. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఒకే ఒక్కరు మన సుందరయ్య. ఇది ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఆయన స్ఫూర్తి ప్రధాత అలాంటి నేతను కాటికెట్ వేసుకొని దేశమంతా వెతికినా ఎక్కడా కనిపించరు. అది మన సుందరయ్య నిజాయతీ, ఆ మహనుభా -వుడు. ఆయన జ్ఞాపకాలు మాత్రం మనసున్నే బుజంతట్టి నిద్రలేపుతున్నాయి. ఆయ స్ఫూర్తితో పనిచేసేనప్పుడు ఆయనకు మనమిచ్చే నివాళి.


పుచ్చలపల్లి సుందరయ్య

### ప్రజా రాజ్యం కోసం..!

సుందరయ్య విశాలాంధ్రలో ప్రజారాజ్యం రావాలి, చూడాలని పోరాటం చేశారు. 1942లో విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే పుస్తకం రచించారు. సుందరయ్య ఆశించినట్లు చెన్నయ్ నుంచి రాష్ట్రం విడిపోయి తెలంగాణ, రాయలసీమ, కోస్తా ప్రాంతాలు ఒక్కటై విశాలాంధ్ర ఏర్పడింది. ప్రజా రాజ్యం కోసం సుందరయ్య పనిచేశారు. రాష్ట్రంలోని వనరులు, అభివృద్ధిపై సమగ్ర అవగాహన కలిగిన నేత ఎవరైనా ఉన్నారంటే అప్పట్లో సుందరయ్య మాత్రమే. విశాలాంధ్ర రెండు ముక్కలైపోయింది. పాలకులు ప్రజా సంక్షేమం, అభివృద్ధి, నిజాయతీ వంటి అంశాలను పట్టించుకోకుండా పదవంటే కేవలం అధికారం కోసం అనేలా వ్యవహరిస్తున్నారు. సుందరయ్య లాంటి మహానుభావులను స్మరించుకుంటేనైనా భావితరాలకు భవిష్యత్తు ఉంటుంది. తరాలు మారినా, యుగాలు గడిచినా సుందరయ్య ముద్ర ప్రజల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటుంది.

### సుందరయ్య ఉద్యమాలకు మార్గదర్శి...?

పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వ్యక్తులను మనం ఇప్పటి కాలంలో చూడగలమా...నీతి, నిజాయతీ, నిబద్ధత, క్రమశిక్షణ వీటికి రూపమెంటే అది సుందరయ్య. తన ఆస్తిని పేదలకోసం ఇచ్చేసి, పిల్లలు పుడితే స్వార్థం వస్తుందని భావించి తన పిల్లలు లేకుండా తన పార్టీ కార్యకర్తలే పిల్లలుగా చివరి వరకు నిలిచారు. చిన్నపాటి పదవి వస్తే పెద్ద పెద్ద కార్లలో తిరిగే ఈ రోజుల్లో పార్లమెంట్ ప్రతిపక్షనేతగా ఉండి. సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లిన వ్యక్తి సుందరయ్య. రాజకీయాలంటేనే డబ్బు, అనే ఈ రోజుల్లో ప్రజల కోసం పనిచేయడం, తానున్నానే భరోసా కల్పించడం ద్వారా ఆయన ప్రజల మనిషిగా మిగిలిపోయారు. సుందరయ్య లాంటినేతలను మళ్లీ మనం చూస్తామా లేదో తెలీదు.

### చివరి క్షణం పేదల కోసమే..

సుందరయ్య తుది శ్వాసవరకు పేదల కోసమే ఆలోచించారు. జీవించారు. ఆరోగ్య సహకరించకపోయినా పార్టీ, ప్రజల కోసం పనిచేశారు. ఆయనకు మూడు ఆపరేషన్లు జరిగాయి., కామెర్లు కావడంతో 1953లో ఢిల్లీలో ఒకసారి ఆపరేషన్ చేశారు. పేగుల్లో పుండు ఏర్పడడంతో మళ్లీ మద్రాసులో చేశారు. మూడో సారి 1960లో రష్యాలో ఆపరేషన్ చేశారు. వైద్యులు వదిలిన చిన్న పేగు పెద్దదైంది. దాంతో అన్నం తిన్న రెండు గంటల వరకు నిద్రపోయేవారు కాదు. 1985 మే 19న మద్రాసులో అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాసవిడిచారు. . నేడు ఆయన మనకు దూరమై 39 సంవత్సరాలు అయింది. ఆయన జ్ఞాపకాలు మాత్రం అలాగే ఉండిపోయాయి. ఆయన వదిలి వెళ్లిన బాధ్యతలు మన ముందు అలాగే ఉన్నాయి. ఆయన ఆశయసాధన కోసం పనిచేసినప్పుడు ఆ మహానుభావుడికి మనం ఇచ్చే నివాళి...

## సముద్రంలో యువకులు గల్లంతు

### కాపాడిన మెరైన్ పోలీసులు

యువకుల ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రమాదవశాత్తు సము ద్రంలో గల్లంతైన యువకుల ప్రాణాలను ధైర్య సాహసాలు ప్రదర్శించి కాపాడి న మెరైన్ పోలీసులు ఉదంతమిది. నె ల్లూరు నగరం డైకాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన విద్యార్థులు టి. జానీ సంజీవి, శివరాం, దినేష్‌రెడ్, నందు సరదాగా గడిపేందుకు శనివారం మండలంలోని కోడూరు బీచ్‌కు వచ్చారు.ఆ ఐదుగురు స్నేహితులు తీరం వెంబడి కాసేపు ఆటపాటలతో గడిపారు. అనంతరం ఈత కొట్టేందుకు వీరు సముద్రంలో దిగారు. సముద్రంలో మునుగుతున్న సమయంలో ఓ రాకాసి అల వీరిలో జానీ అనే విద్యార్థిని ఉక్కిరి బిక్కిరి చేసింది. దీంతో ప్రాణభయంతో జానీ కేకలు పెట్ట సాగాడు. ఈ నేపథ్యంలో స్నేహితుడు జానీని మరో యువకుడు కాపాడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితులు సముద్రంలో గల్లంతయ్యారు. పరిస్థితి గమ నించిన మెరైన్ సిబ్బంది ఆపుల సంజీవి కేవీ శేషగిరిరావు వెంటనే లైఫ్ బోట్ తో సము ద్రంలో కొట్టుకుపోతున్న ఇద్దరు స్నేహితులను కాపాడారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స జరిపి వైద్యశాలకు తరలించారు. దీంతో స్నేహితులు ఇద్దరు సురక్షితంగా బయట పడ్డారు. ఈ సందర్భంగా మెరైన్ సిబ్బంది మాట్లాడుతూ తాము మెరైన్ సిఐ కిషోర్ కుమార్, ఎస్ఐ మ స్తాన్, షరీఫ్, వాసు ఆధ్వర్యంలో పనిచేస్తున్నామని తెలిపారు. గతంలో మైపాడు, కోడూరు బీచ్‌లలో పలువురిని కాపాడగలిగామని తెలిపారు. అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి, ఇద్దరు యువకుల ప్రాణాలను కాపాడిన దుగరా జిపట్నం మెరైన్ పోలీసులు సంజీవి, శేష గిరిలను పర్యాటకులు ప్రత్యేకంగా అభినందించారు. తమ స్నేహితుల ప్రాణాలు కాపాడిన మెరైన్ సిబ్బందికి క తజ్ఞతలు అభినందనలు తెలిపారు.

## చోరీ కేసులో నిందితుడు అరెస్టు

### బంగారు నగలు స్వాధీనం

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-నెల్లూరు : వ్యసనాలకు బానిసై ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్న మీదూరి సునీల్ అను నిందితుడిని బాలాజీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని నగర డిఎస్‌పి డి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మీడియాకు వివరాలు వెల్లడిం చారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు గతంలో నేర చరిత్ర కలిగి ఉన్నాడని, జైలు జీవితం గడిపి ఉన్నాడన్నారు. అతని నుంచి 44.5 సవర్ల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారని నగర డిఎస్‌పి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ నెల 15వ తేదిన నగరంలోని అరవింద నగర్ లో మహాలక్ష్మమ్మ గుడి సమీపం లోని వేమూలపాటి శ్రీ వల్లి ఇంటిలో లేని సమ యంలో తాళాలు పగలగొట్టి బీరువాలో దాచి ఉంచిన నగలు అపహరించడంతో పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు దర్యాప్తు వేగవంతం చేశారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ,వివిధ కోణాలలో దర్యాప్తు ప్రారంభించి మీదూరి సునీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద రూ.14,24,000/- విలువ గల సుమారు 44 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడు 2013 నుండి జిల్లాలో గల వివిధ పోలీస్టేషన్ల పరిధులలో గల ఇంటి తాళాలు పగలకొట్టి దొంగతనం చేసిన కేసులలో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసు విచారణలో తేలిందన్నారు. నిందితుడి పై నవాబుపేట పిఎస్‌లో డిసి షీట్ ఉందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు సొత్తు రికవరీ చేయడములో కృషి చేసిన బాలాజీ నగర్ సిఐ ఎల్ వీరా నాయక్, వారి సిబ్బంది ఏఎస్ఐ పి. శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్ కె.వి. సుధాకర్, సిహెచ్ శివ కుమార్, సిహెచ్ రమేష్, పి. వెంకట రావు కానిస్టేబుల్స్ ఎం. శ్రీహరి,ఏ.తిరుపతి, పి.పార్థ సారధి, ఒవిఎస్ శివ ప్రసాద్ లను ఎస్‌పి అభినందించారన్నారు.

## మహిళలపై దాడి అమానుషం

నెల్లూరు :మహిళలపై దాడులకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, పోలీసు విచారణ చేపట్టి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మహిళా కమిషన్ చైర్పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి స్పష్టం చేశారు. ఇటీవల వింజమూరులో తల్లీకూతుళ్లపై దాడి ఘటనలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువతిని, ఆమె తల్లిని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరా మర్శించారు. శనివారం నగరానికి చేరుకున్న మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అనంతరం మీడియాతో మాట్లాడారు. వింజమూరులో తల్లి కూతుళ్లపై దాడి జరగటం దారుణమన్నారు. కొంతకాలంగా యువతిని ప్రేమిస్తు న్నానంటూ వేధింపులకు పాల్పడుతున్న నాగరాజు శుక్రవారం ఆ యువతి, ఆమె తల్లి పై దాడికి ఒడిగట్టినట్లు గుర్తించామన్నారు. ఈ దాడి సమాచారం తెలుసుకున్న ప్రభుత్వం వెంటనే స్పందిం చిందన్నారు. ఈ నేపథ్యంలో తల్లికూతళ్లను ఆసుపత్రికి తరలించడమే కాకుండా వారి చికిత్సలకు ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. ఈ దాడిలో గాయపడ్డ తల్లి , కూతురు ఇద్దరు ప్రాణభయముతో ఉన్నారన్నారు. వారికి భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరగా పట్టుకోవాలని, శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని ఎస్‌పిని కోరామన్నారు.

## బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు : ఉమ్మడి రాష్ట్రాలలో నిర్వహిం చబడిన తెలంగాణ ఎంసెట్-2024 ఫలి తాలలో బిఆర్ అక్స్‌ఫర్డ్ విద్యా ర్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. శ్యామ్ సిద్విలాస్ (1460),అఖిలేష్ (2651) ఏంజిలీనా చార్లెస్ (5272) రామ్ చౌదరి (5382) నేష్య శ్రీ (5593) యశస్వి (7031) కౌశిక్ (10707 )మోహన కృష్ణ (10966) ర్యాం కులు సాధించారు. ఇలాంటి అత్యుత్తమ ఫలి తాలను సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యా పకు లను ప్రత్యేకంగా అబి నందించిన విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పా ండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కర రావు,బి.నరేంద్ర బాబు, ప్రిన్సిపాల్స్ షావుల్ హమీద్,ఇర్ఫాన్‌లను అభినందించారు.

శ్యామ్ సిద్విలాస్

కె అఖిలేష్

## వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : వాసవి క్లబ్ లెజెండ్స్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలో వాసవి గ్రంథాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా పూజలు నిర్వహించి వచ్చిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా వాసవి సత్ర సముదాయాల మీడియా ఛైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి సందర్భంగా కందుకూరు శ్రీ వాసవి గ్రంథాలయంలో జరుపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మన వాసవి గ్రంథాలయంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు ఎప్పుడూ కొన సాగుతూనే ఉండాలన్నారు. వాసవి క్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్ సేవా ప్రొుదయ రవ్వా శ్రీనివాసులు, సెక్రటరీ ఇన్నమూరి శ్రీనివాసులు, ట్రెజరర్ చీదెళ్ళ క్రిష్ణ, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ కొత్తూరి నటరాజకుమారి, సెక్రటరీ నారాయణ సుకన్య, ట్రెజరర్ పేరూరి లలిత,ఆర్.సి. గుర్రం మంజుల కుమారి, జెడ్‌సి. కోట వెంకటేశ్వర్లు, చక్కా వెంకట సుజాత ఉన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన సర్వీస్ ఓట్లు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలైన సర్వీస్ ఓట్లను ఆర్‌డిఓ ఆఫీస్ లోని రికార్డ్ గదిలో ఉన్న స్ట్రాంగ్ రూములో ఓట్ల కవర్లను భద్రపరిచారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేశారు. డిటిఓ ప్రసాదు , జే సి ఎస్ కోఆర్డినేటర్ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ ముప్పవరపు కిషోర్, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ సిహెచ్ హరికృష్ణ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్లు తరలింపు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి పోస్టులో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచి సీలు వేశారు. శనివారం పోస్ట్ లో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ కవర్లను పోస్టల్ సిబ్బంది కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్ కు అందజేశారు. ఈ పోస్టల్ బ్యాలెట్ లను ట్రంక్ పెట్టెలో భద్రపరిచి సీలు వేశారు.

అనంతరం స్ట్రాంగ్ రూములో బాక్సులను ఉంచి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ కు తాళాలు వేసి సీలు వేశారు. ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బాపిరెడ్డి, వైఎస్‌ఆర్సిపి ప్రతినిధి సుబ్బారాయుడు, టిడిపి ప్రతినిధి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీలు

కందుకూరు :స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులు 12 మంది పాల్గొన్నారు. వారితో జాతీయ నాయకులు చరిత్ర పుస్తకాలు చదివించారు. ఎస్‌కె బాషా కథలు పోటీలు నిర్వహించారు.

ఉలవపాడు :ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో కేశవ శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులతో నీతి కథలు వివిధ రకాల విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించినట్లు గ్రంథ పాలకుడు డి . కోటేశ్వరరావు తెలిపారు.

# వెన్నుపోటు రాజకీయం

## ఇంటూరి, బుర్రాకు వ్యతిరేకంగా పనిచేసిన సొంత పార్టీల నేతలు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో అటూ అధికార పార్టీ అభ్యర్థికి, ఇటు ప్రతిపక్ష టిడిపి కూటమి అభ్యర్థికి వెన్ను పోట్లు తప్పలేదు. ఈ నెల 13న జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి దాదాపు 23 మంది అభ్యర్థులు పోటీ చేశారు. రెండు ప్రధాన పార్టీలతో పాటు కాంగ్రెస్ ,బహుజన సమాజ్ పార్టీ, జై భారత్ పార్టీ ,పిరమిడ్ వంటి పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎన్నికల బరిలో పోటీపడ్డారు. చిన్నాచితక పార్టీలు స్వతంత్ర అభ్యర్థుల సంగతి అటు ఉంచితే ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులకు సొంత పార్టీల నుంచే వెన్ను పోట్లు తప్పలేదు. వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కు ప్రస్తుత ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి అనుచరులు కొందరు నుంచి వెన్ను పోట్లు ఎదురయ్యాయి. ఎన్నికలకు ముందుగా మహీధర్ రెడ్డి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి, బుర్రా మధుసూదన యాదవులతో కలిసి కందుకూరులో జరిగిన వైసిపి ఎన్నికల సభలో పాల్గొన్నారు. అయితే మహీధర్ రెడ్డి కందుకూరు సమన్వయకర్త నియోజకవర్గంలోని ఏ ఇతర ఎన్నికల సభలోను పాల్గొనలేదు. ఆయన అనుచరులైన ఉలవపాడు, గుడ్లూరు మండలాలకు చెందిన కొందరు బాహటంగానే టిడిపి తీర్థం పుచ్చుకోగా మరికొందరు మౌనంగా ఉన్నట్లు నటిస్తూ బుర్రాకు వ్యతిరేకంగా పనిచేశారు. ఉలవపాడు మండలం, కరేడుకు చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బొడ్డు జయరామిరెడ్డి, గుడ్లూరు మండలానికి చెందిన కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు చెరుకూరి సూర్యనారాయణ, గుడ్లూరు సర్పంచ్ పారా జనార్ధన్ వంటి నేతలు బహటంగానే టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సుమారు 11 వేల ఓట్లు ఉన్న ఉలవపాడు మండలం కరేడులో స్వగ్రామానికి రాకుండానే ఓ నేత బయట ఉండి బుర్రాకి వ్యతిరేకంగా చక్రం తిప్పారు. నెల్లూరులో నివాసముంటున్న ఆ నేత మహీధర్ రెడ్డికి బంధువు. గత ఐదేళ్లలో ఆయనే కరేడు గ్రామ పంచాయతీలో రాజకీయ పెత్తనం చెలాయించారు. మహీధర్ రెడ్డి పోటీలో లేనందున తాను ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పిన ఆ నేత ఆచరణలో బుర్రాకు వ్యతిరేకంగా పట్టుదలగా పనిచేశారు. ప్రత్యేకించి గ్రామపంచాయతీ లోని అలగాయపాలెం, తూర్పు రెడ్డి పాలెం, కొత్త రెడ్డిపాలెంలో తన అనుచరులను బుర్రాకు వ్యతిరేకంగా పురిగొల్పారు. ఆ గ్రామంలోని వైసిపి నాయకుల్లో కొందరికి టిడిపి లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శిబిరం నుంచి లక్షలాది రూపాయలు అందేలా చేశాడని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ముడుపులు అందుకున్న వారు కొందరు బహటంగా టిడిపి చేరగా మరికొందరు వైసిపిలో ఉంటూనే వెన్నుపోటు పొడిచారు. కరేడు ప్రధాన గ్రామంలోనూ కొందరు నెల్లూరు నేత అనుచరులు పార్టీ ఫిరాయించగా మరికొందరు వెన్నుపోటు రాజకీయాలు నడిపారు. ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలోను వైసిపికి వెన్నుపోటులు తగిలాయి. బద్దిపూడిలో వైసిపిలో రెండు వర్గాలు ఉన్నాయి. ప్రస్తుత సర్పంచ్ అనిల్ రెడ్డిది ఒక వర్గం కాగా రెండో వర్గం ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు మేరమెట్ల శంకరారెడ్డిది రెండో వర్గం. మొదట్లో రెండు వర్గాలు బుర్రాకు అనుకూలంగా ఉన్నట్లు కనిపించారు. ఆ తర్వాత శంకరారెడ్డి వర్గంలో రాజకీయాలు మారాయి. శంకరారెడ్డి వర్గానికి చెందిన బ్రహ్మానందరెడ్డి అనే వ్యక్తి బహటంగానే టిడిపిలో చేరారు. మిగిలిన శంకరారెడ్డి వర్గీయులు ఎన్నికల కు మూడు రోజులు ముందు వరకు బుర్రాకు మద్దతుగానే కొనసాగారు. అయితే కందుకూరులో నివసిస్తున్న బద్దిపూడి కి చెందిన కాంట్రాక్టర్ ఒకరు చివరి రోజుల్లో స్వగ్రామానికి వెళ్లారు. బుర్రా గెలిస్తే గ్రామంలో అనిల్ రెడ్డికి ఆయన సోదరుడైన బడా వ్యాపారవేత్త రాఘవరెడ్డికే రాజకీయ ప్రాధాన్యం లభిస్తుందంటూ శంకరా రెడ్డి అనుచరులను రెచ్చగొట్టాడు. మూడు రోజులపాటు బద్దిపూడిలో ఉండి శంకరారెడ్డి అభిమానులు ఆ కాంట్రాక్టర్ రెచ్చ కొట్టడంతో పోలింగ్ రోజున ఆ వర్గీయులు టిడిపి వర్గీయులతో దాదాపుగా కలిసి పనిచేశారు. ఆ కాంట్రాక్టరుకి మహీధర్‌రెడ్డి తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రచారం ఉంది. వైసిపికి చెందిన ఎంఎల్‌సి తూమాటి మాధవరావు ఎన్నికల ప్రచారంలో ఎక్కడ కనిపించలేదు. తూమాటి అను చరులుగా భావిస్తున్న కొల్లూరి కొండయ్య (గ్యాస్ కొండయ్య )మాచవరం కు చెందిన సూరం చిరంజీవి రెడ్డి,దోండపాడు కు చెందిన పులిచెర్ల వెంకటసుబ్బారెడ్డి, కరేడుకు చెందిన చెంచురామిరెడ్డి ,కందుకూరుకి చెందిన వాకా రాజారెడ్డి వంటి వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

ఇంటూరి నాగేశ్వరరావు
టిడిపి అభ్యర్థి

బుర్రా మధుసూదన్ యాదవ్
వైసిపి అభ్యర్థి

ఇక టిడిపి పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ దివి శివరాం, టిడిపి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ నుంచి సహ కారం దాదాపుగా లభించలేదు. ఎన్నికల ముందుగా నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చొరవతో ఇంటూరి రాజేష్ నాగేశ్వర రావుల మధ్య సయోధ్య కుదిరింది. ఇద్దరి మధ్య సయోధ్య కుదరడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని ప్రచారం ప్రారంభించిన ఇంటూరి రాజేష్ తన నిర్ణయాన్ని ఉపసం హరిం చుకున్నారు. కానీ రాజేష్ స్వగ్రామమైన వల్లేటివారి పాలెం మండలం బడేవారి పాలెంలో ఆయన అభి మానులు నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా పనిచేశారు. వారు నాగేశ్వరరావు దగ్గరకు వచ్చి ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు.దివి శివరాం కొద్దిరోజులు ముందు నాగేశ్వరరావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేసినప్పటికీ పూర్తిస్థాయిలో పనిచేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన వయసు దాదాపు 70 ఏళు కావడం, అనారోగ్య సమస్యల వల్ల దివి శివరాం ఎక్కువగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోయారని ఆయన సన్నిహితులు చెబు తున్నారు. మరో మాజీ శాసనసభ్యుడు పోతుల రామారావు కూడా ఇంటూరి నాగేశ్వరరావుకు అను కూలంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. పోతులకు కూడా అనారోగ్య సమస్యలు ఉన్నాయి. పైగా పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శాసనసభ అభ్యర్థి త్వాన్ని ఇంటూరి నాగేశ్వరరావుకు ఇచ్చే సమయంలో మాట మాత్రం సంప్రదించలేదని ఆవేదన పోతుల రామా రావులో ఉంది. పోతుల రామారావు వీరాభిమానులు కొందరు టిడిపిలో కొనసాగినప్పటికీ ఇంటూరి నాగేశ్వం రావు ఓటమినే కొందరు ఇప్పటికీ కోరుకుం టున్నారని ప్రచారం లేకపోలేదు.

## అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-నెల్లూరు :జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు, అధిక ఫీజులు వసూళ చేయకుండా ఫీజుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మెండా శ్రీహర్ష డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడదుల చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇప్పటికే పలు విద్యా సంస్థలు అడ్మిషన్ల వేటలో నిమగ్నమైయ్యాయన్నారు. రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నా యన్నారు. జిల్లాలో సుమారు 300కు పైగా ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో దాదా పు 1.50 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. జిఒ నెంబర్ 53 ప్రకారం 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు గ్రామాల్లో రూ. 10 వేలు, పట్టణంలో రూ.15 వేలు, నగరంలో రూ. 20 వేలు ఫీజులు వసూలు చేయాలని గత ఏడాది ప్రభుత్వం నిబంధనలు పెట్టిం దన్నారు. ప్రయివేటు స్కూల్ యాజమాన్యం కోర్టును ఆశ్రయించి సంబంధిత జిఒను రద్దు చేయించుకున్నారన్నారు. దీంతో తమ ఇష్టారాజ్యంగా ఫీజులతో పాటు బస్సు చార్జీలు, పుస్తకాలు ఇలా రకరకాలుగా సంవత్స రానికి వేలల్లో, కొన్ని స్కూళ్లలో లక్షల్లో వసూలు చేసుకొని జేబులు నింపుకుంటున్నారన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు తమకు ఏమి సంబంధం లేనట్టుగా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో సంబంధిత ఉన్న తాధికారులు స్పందించి ఫీజుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆరాధన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - లింగసముద్రం :మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. 41 రోజులపాటు దత్త దీక్ష చేపట్టిన స్వాములు ఇరుముడి కట్టుకొని మొగిలిచర్లకు చేరుకుంటున్నారు. గ్రామంలోని శివాలయం వద్ద భారీగా దత్త స్వాములు ఇరుముడి కార్యక్రమంలో శనివారం పాల్గొ న్నారు. అక్కడి నుండి సాయంత్రం కలశ మహోత్సవం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న దత్త స్వాములు భక్తులతో మొగిలిచర్ల కిక్కిరిసింది. సుమారు రెండు కిలోమీటర్లు నడుచు కుంటూ దత్తాత్రేయ స్వామి సన్నిధానానికి చేరుకునాౖను. ఇరుముడి కార్యక్రమానికి వచ్చిన భక్తులకు,స్వాములకు, బంధువులకు,గ్రామస్తులకు మొగిలిచర్ల గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కలిశములతో ఊరేగింపుగా తరలి వెళ్లిన దత్త స్వాములు

### భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లులి

మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి ఆరాధన కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు. ఆరాధన మహోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు. కందుకూరు, కావలి ఆర్‌టిసి డిపో ల నుండి ప్రత్యేక బస్సులు దేవాలయం వద్దకు నడుపు తున్నట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపారని తెలియజేశారు.

# దిగజారుతున్న పత్తి ధర..!

## ఆందోళనలో రైతులు

**ప్రజాశక్తి-గుడ్లూరు**

మండలంలో పత్తి మార్కెట్లో ధర మే మొదటి వారంలో 7000 రూపాయలు పలికింది. అప్పుడు పత్తి కోతలు ప్రారంభ దిశలో ఉన్నాయి. అరకొరగా వస్తున్న పత్తి క్వింటాలు 7000 రూపాయలు ధర పలికింది. పత్తి కోతలు ముమ్మరంగా జరగడంతో మండలంలో ప్రతిరోజూ 1000 క్వింటాలకు పైగా మార్కెటుకు త్వరలో రావడంతో ధరలు అమాంతంగా తగ్గిపోయాయి. క్వింటా 7000 రూపాయలు ధర ఉన్నప్పటికీ 6000 రూపాయలకు పడిపోవడంతో పత్తి ధర పతనం అంచుకు చేరింది. గతేడాది ఇదే సీజన్లో పత్తి కింటాల్ ధర 12 వేల నుంచి 12,500 ఇది ప్రస్తుతం పత్తి ధర సగానికి సగం పడిపోవడంతో రైతులు దిగాలు పడ్డారు. మండలంలో రైతులకి వరంగా ఉన్న రాళ్లపాడు రిజర్వాయర్ ఆయకట్టు కింద సుమారు 20వేల ఎకరాలకు పైగా ఈ ఏడాది పత్తి సాగు చేపట్టారు. తెగుళ్ల నివారణ కోసం వేలకు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి అప్పులు తెచ్చి పురుగు మందులు పిచికారి చేశారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు వచ్చి దిగుబడి రావాల్సి ఉండగా ఆరు నుంచి ఏడు గంటల మాత్రమే పత్తి దిగుబడి వచ్చింది. దీంతో పెట్టుబడులు ఖర్చులు వస్తాయని ఆశించిన రైతులకి రోజురోజుకి పత్తి ధర పడిపోవడంతో రైతులు కష్టాల్లోకి దళారుల పాలు అవుతున్నట్లు గ్రహించారు. పత్తి మార్కెట్లో కొనుగోలుదారులు ధరలను కుమ్మక్కై ధరలు తగ్గించినట్లు పత్తి సాగు రైతు తెలిపారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఎకరాల కొద్దీ కౌలుకు తీసుకొని సాగు చేపట్టిన కౌలు రైతులకి గిట్టుబాటు ధర లభించకపోవడంతో అప్పులు తీరే పరిస్థితి కనిపించలేదని వాపోతున్నారు.

# 'సర్వేపల్లి'ఎవరిని వరిస్తుందో..?

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

సర్వేపల్లి నియోజకవర్గంలో గెలుపు ఓటములను మహి ళలు నిర్ణయించ నున్నారు. నియోజకవర్గంలోని తోటపలి ్లగూడూరు, ముత్తుకూరు, వెంక టాచలం, మనుబోలు, పొదలకూరు మండలాల్లో 1,12,790 మంది పురుషులు, 1,19,195 మంది మహిళలతో మొత్తం 2,32,011 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరిలో ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రికల్లో 95,792 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 16,998 మంది పురుషులు ఓటు వేయలేదు. 98,810 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 20,385 మంది మహిళలు గైర్హాజరయ్యారు. ఈ మేరకు మొత్తం 1,94,610 మంది (83.88 శాతం) తమ ఓటు హక్కును వినియోగిం

చుకోవడం జ రిగింది. ఈ లెక్కన ఓటు హక్కు వినియోగించుకున్న వా రిలో పురుషులు కంటే 3,018 మహిళలు అదనంగా ఉన్నారు. దాంతో మహిళా ఓటు బ్యాంక్ ఎవరివైపు మొగ్గ చూపుతుందో వారే ఈ ఎన్నిక ల్లో విజేతలు అన్నది నిజం. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థి, మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, టీడీపీ (కూటమి) అభ్యర్థి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిల గెలుపు ఓటముల్లో కీలక పాత్ర పోషించే ది మహిళలే. ఈ సార్వ త్రిక ఎన్నిక ల్లో మహిళలే ఎక్కువగా ఓటుహ క్కు వినియోగించుకున్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. ఎంతో మంది మహిళలు చంటి పిల్లలను ఎత్తుకొని క్యూలో గంటల తరబడి నిల్చొని మరీ ఓటు వేశారు. దాంతో అభ్యర్థుల గెలుపు ఓటములలో మహిళలే ప్రధాన పాత్ర పోషించనున్నారనేది ని ర్వివాదాంశం. ఇక సర్వేపల్లి నియో జకవర్గంలో ఏ మండలాన్ని తీసుకు న్నా ఓటు హక్కు వినియోగించుకు న్న వారిలో పురుషులు కంటే మహి ళలే అధికంగా కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళలు వైసీపీ అభ్యర్థి గోవర్ధన్ రెడ్డిని గెలిపిస్తారా? లేదా టీడీపీ అభ్యర్థి చంద్రమోహన్ రెడ్డిని గెలిపిస్తారా? అనేది చూడాలి మరీ.

# రోడ్డు సరే..మార్జిన్ సంగతేంటి..?

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

కోట్లదిరూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ రోడ్డు మార్జిన్ గురించి పట్టించుకోకుండా వదిలి పెట్టారు. ఫలితంగా ఈ రోడ్డుపై ప్రయాణం అసౌకర్యంగా, ప్రమాదకరంగా మారింది. వివరాల్లో కి వెళితే..మండలంలోని ఇస్కపాలెం గ్రామం ద్వారా వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డును దాదాపు రెండు నెలల క్రితం సిమెంట్‌తో నిర్మించడం జరిగింది. ఈ నేపథ్యంలో రోడ్డు ఎత్తు సుమారుగా ఒకటిన్నర ఎత్తు పెరిగింది. కాంట్రాక్టర్ రోడ్డు మార్జిన్ లెవలింగ్ చేయకుండా అలాగే

వదిలి పెట్టేశారు. దాంతో ఈ రోడ్డు పై ప్రయాణం వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మరి ముఖ్యంగా రోడ్డు పక్కన నివాసాలుండే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు వాహనాలకు ప్రమాదకరంగా కూడా మారింది. అంతేకాకుండా రోడ్డు మార్జిన్ లెవలింగ్ విషయంలో కాంట్రాక్టర్ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల ఆర్అండ్‌బి శాఖ అధికారులు స్పందించక పోవడం పట్ల గ్రామస్తులు, వాహనాల చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధి కారులు జోక్యం చేసుకొని సిమెం ట్ రోడ్డు మార్జిన్ లెవలింగ్ చేసే విషయంలో యుద్ధప్రాతిపదిన చర్యలు తీసుకొని ప్రజలకు, వాహనాల రాక పోకలకు ఎదురవుతున్న ఇ బ్బందులు తొలగించాల్సిన అవస రం ఎంతైనా ఉంది.

## మతవిద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఎన్నికల ప్రచారం అత్యంత ప్రమాదకరం

**ప్రజాశక్తి-కావలి.**

ప్రస్తుత భారతదేశ ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో ఓటమి భయంతో ,' మిగిలిన ఏకైక ఆయుధంగా ,మతవిద్వేషాలను రెచ్చగొడుతూ"ఇండియా కూటమిగెలిస్తే హిందూ ఓటర్లను ముస్లిములపైకి ఉసిగొల్పుతూ ప్రచారంలో ప్రసంగించడం గర్హనీయమని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు పేర్కొన్నారు. దీనికిఉదాహరణగా "ఉత్తరప్రదేశ్ లో యోగి ముస్లిముల నివాసాలపై బుల్ డోజర్లను ప్రయోగించి తొక్కించడాన్ని"ఒకఉదాహరణగా చర్యగా సమర్థం చారన్నారు.1947 స్వాతంత్ర్య సాధనకు పూర్వం నుండే చిరకాలంగా హిందూ ,ముస్లిం ,సిక్కు ,బౌద్ధ ,జైనులు ఈ భారత గడ్డపై స్థిర నివాసం చేస్తూ .1950 లో రాజ్యాంగం అమలు తర్వాత మతసామ్రాజ్యాన్ని కలిగి , దేశపౌరులుగా గుర్తించబడి నివసిస్తున్నారన్నారు.2014-19 ఎన్నికల్లో గెలిచాక కేంద్రపీఠాన్నెక్కిన బీజేపీకి ఈ సత్యం తెలియనిదా? అని ప్రశ్నించారు.ఇప్పుడు దేశప్రజలకు కావలసింది అభివృద్ధి కానీ , అయోధ్య రాముడుకాదని ,"మతతత్వాన్ని మోడీ తప్ప ఏ ఇతర ప్రధానులు"కలిగివుండలేదన్నారు.ఎన్నికల ప్రచారంలో మతాన్ని రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయ లేదని కావలి ఉమెన్ ఫోర్స్ అభిప్రాయపడుతూ" మతతత్వం దేశప్రజల సమైక్యతకు తీవ్ర ప్రమాదకరమని పిలుపునిస్తోందని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు !సి. శారద కస్తూరి, బి . సుజాత , సుహాసిని ,ఫాతిమా ,నూర్జహాన్ తదితర సభ్యులు కోరారు.

సన్మానిస్తున్న దృశ్యం

## 'కావ్య'తో కావలి కనకపట్నం

**ప్రజాశక్తి-కావలి.**

కావలి కనకపట్నం అనేది కావ్య క్రిష్ణారెడ్డితో సాధ్యం అవుతుందని కాపు సోదరులు పేర్కొన్నారు. శనివారం కాపు నేతలు ఎన్డీఏ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్యక్రిష్ణారెడ్డిని ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో కలిసి శాలువాలతో సత్కరించి, బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాపు నేతలు మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో కావ్య క్రిష్ణారెడ్డి భారీ మెజారిటీ సాధించడం ఖాయమని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కావలిలో కాపులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడమే కాక, మహిళల పైన కూడా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. చిన్న సమస్యను పరిష్కరించలేని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కాపు నేత సూరిశెట్టి సురేష్ చావుకు కారణమయ్యాడని ఆరోపించారు. రాజకీయంగా, అలాగే పదవులలో కాపులకు ప్రతాప్ రెడ్డి ఎలాంటిప్రాధాన్యత కల్పించలేదన్నారు. ఎన్నో అవమానాలను, దాడులను, దౌర్జన్యాలను ఎదుర్కొన్న కాపులంతా ఏకమైతెలుగుదేశం పార్టీని ఈసారి ఆశీర్వదించడం జరిగిందన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి ఎమ్మెల్యే అయితే పడకేసిన అభివృద్ధిఇకపై పరుగులెడుతుందన్నారు.అనంతరం కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తనను గెలిపించడానికి కాపులు విశేషంగా కృషి చేశారన్నారు. కాపుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాపు భవనాన్ని నిర్మిస్తానని, కాపు సంక్షేమ నిధికి 25 లక్షలు అందజేస్తానని తెలిపారు. కావలిలో కావ్య ఉన్నంత వరకు కాపులకు బెంగ అవసరం లేదన్నారు. కక్షలు, కార్పణ్యాల కోసం రాజకీయాలోకి రాలేదని, సేవ చేయడానికి వచ్చానని తెలిపారు. కావలిలో పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. కావలిని కాపాడుకోవడం కోసం, నా తన గెలుపు కోసం కృషి చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరికీ ధన్యవాదములు తెలుపుతున్నానన్నారు.

మాట్లాడుతున్న కావ్యకృష్ణారెడ్డి

## పర్యావరణాన్ని రక్షించుకుందాం

**ప్రజాశక్తి-కావలి.**

మనకు ముప్పు దగ్గరకు వస్తూ ఉందని, దాని నుంచి తప్పించుకునే బాధ్యత కూడా మన చేతి లోనే ఉందని, అందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పెంచాలని ఎస్.సి., ఎస్టీ. విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యులు, న్యాయవాది ఇసకల సాయి ప్రసాద్ పిలుపు నిచ్చారు. అయన మాట్లాడుతూ 56 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్దమనుషులు( జీవరాసులు ) బతక లేరన్నారు . దీనిని మనమందరం గమనించాలన్నారు. ప్రస్తుతం దేశానికి 500 కోట్ల చెట్లు అవసరమన్నారు. కొత్త మొక్కలను నాటాలన్నారు. ఒక మొక్క పెరగడానికి 5 నుంచి 7 సంవత్సరాల వరకు పడుతుందన్నారు. వాతావరణం చల్లబడుతుందని, వర్షాలు కురుస్తాయని, ఆక్సిజన్ సస్యశ్యామలంగా ఉంటుం దన్నారు. పంటలు బాగా పండుతా యన్నారు. మన ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా ఇక నుంచి మనం కూడా బాధ్యత తీసుకోవాలన్నారు.ఉన్న చెట్లను రక్షించుకుంటూ, కనీసం ఒక్కొక్కరు రెండు మొక్కలు నాటి రక్షించుకుంటే చాలు 5 సంవత్సరములలో ఇటువంటి ఎండలు, వేడి, ఉండదన్నారు. ఇది నేనే చెప్పేది కాదు ఇంకా ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ భాస్కర నాయుడు కూడా చెప్పారన్నారు. ఆహారం, ఆక్సిజన్, వర్షాలు, వాతావరణం, ఆర్థిక వ్యవస్థఅన్ని బాగుంటాయన్నారు. అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని( మొక్కలు నాటేది,అడవిని రక్షించుకొనేది ) ఒక మంచిమనసుతో యజ్ఞంగా ఇప్పుడే ప్రారంభించాలన్నారు. భవిష్యత్తులో ముందుకు మన బిడ్డలకు జీవితాన్ని ఇచ్చిన వాళ్లం అవుతామన్నారు.

## టెన్షన్..టెన్షన్

**ప్రజాశక్తి-నెల్లూరు**

వీక్షణం

సార్వత్రిక ఎన్నికలు రాను వచ్చాయి.. ముగిసిపోనూ పోయాయి. ఎన్నికల్లో భరిలో నిలిచిన అభ్యర్థులు, వారి అభ్యర్థిత్వాన్ని బలపరిచిన నాయకులు, అభ్యర్థుల గెలుపును ఆకాంక్షిస్తూ పనిచేసిన కార్యకర్తల్లో మాత్రం టెన్షన్.. టెన్షన్ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ ఉత్కంఠకు తోడు తాము పనిచేసిన అభ్యర్థి విజయం సాధిస్తారని కొంత మంది, మరి కొంత మంది తమ అభ్యర్థి గతంలో జరిగిన ఎన్నికల్లో సాధించిన దాని కంటే ఇంకా ఎక్కువ మెజార్టీ సాధిస్తారని వాదిస్తూ కాయ్ రాజా.. కాయ్ అంటూ పందేలు కాస్తున్నారు. మరి కొంత మంది ఓటుకు వేల రూపాయలు పంపిణీ చేశామని, మహిళలకు చీరలు పంపిణీ చేశామని, తమ పార్టీకి ప్రజలు అధికారం కట్టబెడతారంటూ జబ్బలు చరుచుకుంటూ క్షణం ఒక యుగం లాగా ఓట్ల లెక్కింపు కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికలు అయిపోయాయి.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును ఎప్పుడు జమ చేస్తారా అంటూ ఎదురు చూస్తున్నారు. మరి కొంత మంది బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాలో డబ్బు జమ అయిందా .. లేదా అంటూ బ్యాంకు సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్నారు. రుతుపవనాలు తాకిడి వల్ల జిల్లాలో అక్కడక్కడా చిరు జల్లులు పడటంతో ఎండ తీవ్ర తగ్గిందని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమలు అవుతుందని, ఎక్కడా ఏ ప్రాంతంలోనూ రాజకీయ పార్టీలు సంబరాలు జరుపుకోరాదంటూ ఎన్నికల సంఘం షరతులు విధించినప్పటికీ , జిల్లాలో ఎక్కడా అమలు అవుతున్న దాఖలాలు లేవు. ఎందుకంటే ఎన్నికలు పూర్తియిన రోజు రాత్రి నగరంలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ కార్యాలయాల ఎదుట, ప్రధాన నాయకుల ఇళ్ల ఎదుట తమదే గెలుపు అని పేర్కొంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబరాల్లో భాగంగా బాణాసంచా కాల్చడం.. స్వీట్లు పంపిణీ చేసుకోవడం, అక్కడక్కడా ఊరేగింపులు సైతం నిర్వహించుకొని ఒకరినొకరు అభినందించుకున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఏ రాజకీయ పార్టీలు జరుపుకున్న సంబరాలు నిజం అవుతాయో వేచి చూద్దాం..

## అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి

**ప్రజాశక్తి-కావలి.**:శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఎన్డీఏ కూటమి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆర్యవైశ్యులకుశుభాకాంక్షలు తెలిపారు.అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి దుస్సాలువలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. వాసవి మాత ఆలయంలో ఆర్యవైశ్యులతో మమేకమై పేరు పేరున అందరినీ పలకరిస్తూ ఆయన తన అభిమానాన్ని చాటుకున్నారు. ప్రత్యేకంగా అక్కచెల్లెమ్మ లకు నమస్కరించి వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, కుంకుమ పూజ, లక్ష మల్లెల పూజ, తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, సెవన్ లైన్స్ సభ్యులు, వాసవి అమ్మవారి భక్తులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

**ప్రజాశక్తి-విడవలూరు:** మండల పరిధిలోని దంపూరు రామచంద్రాపురం ప్రాంతాలలో కలుషిత నీరు తాగడం వల్ల వాంతులు, విరోచనాలతో గ్రామస్తులు అనారోగ్యానికి గురయ్యారు. దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ అమర్నాథ్ రెడ్డి వారికి తగిన చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని తాగునీరు ఎక్కడ కలుషితం కాకుండా చూడాలని వాటర్ ని కాచుకొని తాగాలని చుట్టుపక్కల చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలోని మురుగుగుంటల వద్ద బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలన్నారు. డైరెక్టరుకు

సంబంధించి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తులందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎవరి ధీమా వారిదే

**ప్రజాశక్తి-గుడ్లూరు**: ఈనెల 13వ తారీకు జరిగిన ఎన్నికల్లో ఇదివరకేన్నడు లేని విధంగా గుడ్లూరు మండలంలో 88 నుంచి 90 శాతం పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల్లో 73శాతం గా ఉన్న పోలింగ్ సరళి ఈసారి ఎన్నికల్లో ఎవరు ఊహించడం అంత విధంగా భారీగా ఓటరూ పోలింగ్ కేంద్రానికి భారీ ఎత్తున తరలివచ్చి ఉదయం 6 నుంచి రాత్రి పదిన్నర గంటల వరకు క్యూలో నిలబడి ఓట్లు వేయడం పట్ల ఎన్నికల పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. దీంతో పెరిగిన ఓటర్ల శాతం వలన గెలుపు మాదంటే మాదని టిడిపి వైసిపి వారు అంచనాలు వేసుకుంటున్నారు. గుడ్లూరు మండలంలో వైసీపీకి గతంలో భారీ మెజారిటీ వచ్చింది. ఈసారి పోలింగ్ శాతం పెరగడం వలన టిడిపికే విజయం చేకూరుస్తుందని మండల స్థాయి టిడిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కార్యకర్తలు గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లనే ప్రభావతం చేసేందుకు రెండు నెలల పాటు ప్రతి ఓటర్ ని కలుసుకొని చైతన్య పరచటంలో సాయి శక్తుల కృషి చేశారు. గ్రౌండ్ వర్క్ చేయడంలో వైసిపి విఫలమైందని పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో ఈసారి టిడిపి అభ్యర్థి ఇంటూరు నాగేశ్వరరావు కందుకూరు నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తారని టిడిపి కార్యకర్తలు డిమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 46 ఎన్నికల కేంద్రాల్లో 88 నుంచి 90 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగు సరళని పట్టి కార్యకర్తలు భావిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో స్థానిక నాయకులు కొందరు గెలుపు పై పందేలు వేసుకుంటున్నారు. ఫలితాల కోసం మండలంలో ఉత్కంఠ నెలకొంది.

నుజ్జునుజ్జయిన కారు

## లారీని ఢీకొన్న కారు నలుగురికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-కోవూరు**

ఆగిన లారీని కారు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన కొడవలూరు మండలం, టపాతోపు వద్ద శు క్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బాపట్ల జిల్లా పిట్టల వారిపాలెంకు చెందిన 8 మంది కారులో బ్రహ్మంగారి మఠం, ఒంటి మిట్ట రామాలయాలను దర్శించుకొని తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. టపాతోపు క్రాస్ రోడ్డు వద్ద కారు వేగంగా వస్తుండగా, ముందు వెళుతున్న లారీ హఠాత్తుగా ఆగి రోడ్డు పక్కన ఆపేందుకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. వెనుక వస్తున్న కారు వేగం అదుపు కాక లారీ వెనుక భాగాన ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆట్ల ఏడుకొండల రెడ్డి, గుడివాడ దుర్గారావు, అన్నం కోదండరామిరెడ్డి, అసోదియా మల్లారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. పలవగా. మల్లారెడ్డి పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండగా మిగిలిన ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటిలేటర్ పై అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కారులో ఉన్న మరో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. వీరంతా ఒక గ్రామానికి చెందినవారు కావడంతో దైవ దర్శనానికి ప్రత్యేక కార్లు బయలుదేరినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**మానవత్వం చాటుకున్న వైద్య విద్యార్థిని**

ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళు తున్న వైద్య విద్యార్థిని సుకన్య మానవత్వం చాటుకున్నారు. ప్రమాదాన్ని గుర్తించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కార్‌లో ఉన్న బాధితులను స్థానికుల సాయంతో వెలికి తీయడంతో పాటు వారందరికీ ఆమె ప్రథమ చికిత్స అందించారు.108 వాహనానికి సమాచారం ఇచ్చి వారందరిని అందులోకి తరలించడంలో ఎంత చొరవ చూపారు. వైద్య విద్యార్థిని మానవతతో అర్ధరాత్రి ప్రమాద స్థలంలో చూపించిన చొరవ బాధితులు పట్ల కనబరచిన తపన స్థానికులు నివ్వెరపోయారు. బాధ్యత పట్ల ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో అర్ధరాత్రి వైద్య విద్యార్థిని ప్రమాద బాధితుల పట్ల చేసిన సేవ మానవత్వాన్ని అందరూ ప్రశంసించారు.

## ఎన్నికల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

ఎన్నికల నిబంధనలను బేఖాతార్ చేసి అక్రమాలకు పాల్పడిన తోటప ల్లిగూడూరు మండలం కొత్తపాలెం టీడీపీ సర్పంచ్ చేవూరు శ్రీనివాసు లుపై చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్ర బాబు డిమాండ్ చేశారు. శ నివారం కోవెరపాలెం గ్రామంలో ఏ ర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ పంచా యతీలో ఎన్నికల అధికారుల ఆధ్వ ర్యంలో కాకుండా సర్పంచ్ శ్రీనివాసులు కనుసన్నల్లో ఎన్నికలు జరిగాయాని సురేంద్ర బాబు ఆరోపిం చారు. శ్రీనివాసులు ఏకంగా పోలింగ్ బూత్‌లో ఎన్నికల ప్రచారం చేసిన ప్పటికీ ఎన్నికల అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరమని విమర్శించారు.

టీడీపీ నాయకు లు అక్రమాలకు పాల్పడుతున్నా స్థానిక వైసీపీ నాయకులు కూడా పట్టిం చుకోక పోవడం పట్ల సురేంద్ర బాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకా కుండా టీడీపీ నేత శ్రీనివాసులు ఎ న్నికల నిబంధనల ఉల్లంఘనను క నీసం వైసీపీ ఏజెంట్లు కూడా ఖండిం చక పోవడంపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈ తరహా ఎన్ని కలు కడపలో విన్నామని, అయితే ఇప్పుడు తోటపల్లిగూడూరు మండ లంలో కొత్తపాళెం గ్రామంలో చూశా మని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## పేద దళిత విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

**ప్రజాశక్తి-నెల్లూరు**

పది పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత పొంది, 500 మార్కులకు పైగా సాధించిన ముగ్గురు దళిత సామాజిక వర్గానికి చెందిన (మాదిగ) విద్యార్థిని, విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఎం.ఇ.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల పాక మస్తానయ్య బి.సి బాలుర వసతి గృహం, హస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు ఈ నెల 26వ తేదీన పొదలకూరు రోడ్డు ప్రాంతంలోని పద్మావతి స్కూల్‌కు ఉదయం 10 గంటలకు తల్లిదండ్రులతో హాజరు కావాలన్నారు. నగదు ప్రోత్సాహం అందజేసేందుకు 'జనరల్ నాలెడ్జ్' పరీక్ష నిర్వహిస్తామని, ఒక గంట సమయంలో విద్యార్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ప్రతిభను కనపరిచిన మొదటి విద్యార్థికి రూ.25 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ. 15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నెంబరు 9959090621,6301070312 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులతో గ్రంథపాలకుడు

## వేసవి శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి కోవూరు**

అంతరిక్షం అవకాశాలు అద్భుతంమని బుచ్చిరెడ్డిపాలెం శాఖ గ్రంథాలయ అధికారిణి కె.మంజులత అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో విశిష్ట సేవలు అందించిన కలాం, సునీత విలియమ్స్, రాకేష్ శర్మ వంటి మహోన్నతుల గురించి విద్యార్థులకు వివరించారు. ఖగోళ శాస్త్రంలో భారతీయుల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నేటితో భారతావని అణుపరీక్షలు నిర్వహించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఫోక్రాన్-1, ఫోక్రాన్-2 గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యులు గండికోట సుధీర్ కుమార్, గ్రంథపాలకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేక్ తినిపిస్తున్న దృశ్యం

## శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-కావలి**

కావలి అర్చక సంఘం అధ్యక్షుడు, శ్రీనివాస్ ఆచార్యులు 59వ పుట్టినరోజు వేడుకలు శనివారం పాదర్తి నాగరాజు షాప్ దగ్గర అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కావ్య కృష్ణారెడ్డి విచ్చేసి కే. శ్రీనివాసాచార్యులకి శాలువా కప్పి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కే. శ్రీనివాస్ ఆచార్యులు కావ్యా కృష్ణారెడ్డిని ఆశీర్వదించి మాట్లాడారు. జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తారని, కావలి అభివృద్ధికి తోడ్పడతారని.. పేద ప్రజల బాధలు తీరుస్తారని మంచి పరిపాలన చేస్తారని ప్రజల మన్నన లు పొందుతారని తెలిపారు. తదనంతరం వామ్ మహిళా సభ్యులందరూ కలిసి చలివేంద్ర కార్యక్రమంలో మజ్జిగ, చల్లని నీరు,తదితర వస్తువవులు పంచిపెట్టారు.

చెక్కు అందజేస్తున్న దృశ్యం

## మృతురాలి కుటుంబానికి చెక్కు అందజేత

**ప్రజాశక్తి-కావలిరూరల్**

.మండల పరిధిలోని మన్నగదిన్నె ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న చాట్ల వనజ కుమారి ఈనెల 8వ తేదీన అనారోగ్య కారణంగా మృతిచెందిన విషయం విధితమే. వారి కుటుంబ సభ్యులకు కుటుంబ సంక్షేమం కోసం శనివారం యుటియఫ్ కావలి రూరల్ మండల అధ్యక్షులు షేక్ ముజిబ్ అహ్మద్ ఒక లక్ష ఇరవై వేల రూపాయల విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మంచి నిబద్ధత కలిగిన ఉపాధ్యాయినిని కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు యుటిఎఫ్ మండల శాఖ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో యుటియఫ్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి శ్రీదేవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి..

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**:

పుచ్చలపల్లి సుందరయ్య ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు స్వాతంత్ర సమరయోధుడు కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య తెలుగు నాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు కుల వ్యవస్థను నిరసించిన ఇతను అసలు పేరు పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి లోని రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్నాడు. సహచరులు ఇతను కామ్రేడ్ పి ఎస్ అని పిలిచేవారు. ఇతను నిరాడంబరంతో ఆదర్శ జీవితం గడిపారు. స్వాతంత్ర సమరంలోని అనేక ఉద్యమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యునిగా సుదీర్ఘకాలం పనిచేశాడు . ఆ సమయంలో పార్లమెంటుకు కూడా సైకిల్ మీద వెళ్లేవాడు. అలాంటి స్వాతంత్ర సమరయోధుడు వర్ధంతి వేడుకలు చెర్లో రమణారెడ్డి భవన్ సిపిఎం కార్యాలయంలో 19వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. ఈ వర్ధంతి కార్యక్రమానికి సిపిఎం పార్టీ నాయకులు , కార్యకర్తలు అభిమానులు , అధిక సంఖ్యలో పాల్గొని పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.